క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

చివ్వెంల : కొత్తగా పట్టాదారు పాస్‌పుస్తకం పొందిన వారు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ధరావతు వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు జూన్ 5వ తేదీ లోపు భూభారతిలో డిజిటల్ సంతకం అయ్యి ఉండాలని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల లోపు వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 14 ఆగస్టు 1966 నుంచి 14 ఆగస్టు 2007 మధ్య జన్మించిన వారిని అర్హులుగా పేర్కొన్నారు. 2025 జూన్ 5 వరకు కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హత ఉండి గతంతో దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. రైతులు దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, రైతు పట్టాదారు పాస్ పుస్తకం, జూన్ 5వ తేదీలోపు డిజిటల్ సంతకం అయిన ఆన్‌లైన్ పేపర్ అందించాలని తెలిపారు. అదే విధంగా గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు ఆధార్ కార్డులో లోపాలు, నామిని పేరు మార్పులు కూడా చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 14వ తేదీ నుంచి 2025–26 బీమా సంవత్సరం ప్రారంభం అవుతుందని తెలిపారు.

వ్యాస రచన పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

సూర్యాపేట : ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ పీఓ ఎస్.శృతి పాల్గొని విద్యార్థులకు ఆదివాసీ దినోత్సవం ప్రాముఖ్యత, ప్రత్యేకతను వివరించారు. అనంతరం ఇన్‌చార్జ్ వైస్ ప్రిన్సిపాల్ జి.సుష్మ మాట్లాడారు. ఆదివాసీలు ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)కు సంబంధించిన కోర్సుల మీద పట్టు సాధించాలని సూచించారు. ప్రిన్సిపాల్ శ్రీవాణి మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని కోరుకున్న రంగంలో రాణించాలని తెలిపారు.

సీపీఎం నాయకుడికి నివాళి

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామానికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాటయోధుడు పాలెల్లి పుల్లయ్య శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని సూర్యాపేట మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షంతోపాటు పలువురు నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : ముకుందాపురం గ్రామ శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో శనివారం ముకుందాపురం గ్రామానికి ఆర్‌ఎంపీ చిరందాస్ ఉపేంద్రాచారి –మంజుల దంపతుల కుమార్తె నిర్మల పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమం వ్యవస్థాపకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కోఆర్డినేటర్ వాచేపల్లి జ్యోతి పాల్గొన్నారు.

శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో..

మండలంలోని స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్ –రాణి దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అధ్వానంగా వీధులు.. ఎన్నాళ్లీ తిప్పలు




నెమ్మికల్ గ్రామంలోని పలు వీధుల్లో సీసీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు, బురద



జలమయంగా మారిన ఓ వీధి

- నెమ్మికల్‌లో కొద్దిపాటి వర్షానికే వీధుల్లో నిలుస్తున్న నీరు
- నడిచి వెళ్లడానికి కూడా వీలులేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

ఆత్మకూర్ (ఎస్) : ఆత్మకూరు మండలం నెమ్మికల్ గ్రామ పంచాయతీలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో పలు వీధుల్లోని సిమెంటు రోడ్లపై బురద నీరు నిలవడం వల్ల వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గ్రామంలోని ప్రధాన వీధి అయిన పెద్ద బజారులో సీసీ రోడ్డు పల్లంగా ఉండడం, మురుగు కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉండడం ఈ సమస్యకు ప్రధాన కారణమని గ్రామస్తులు చెబుతున్నారు. కొత్తగా నిర్మించిన కొన్ని ఇళ్లు రోడ్డు కంటే ఎత్తులో ఉండటం వల్ల వర్షం నీరు రోడ్డుపైనే నిలుస్తోంది. దీంతో వాహనాలు వెళ్లినప్పుడు బురద నీరు పాదచారులపై పడటమే కాకుండా, చాలామంది జారిపడి గాయపడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమలకు నిలయంగా..

కేవలం పెద్ద బజారులోనే కాకుండా, గ్రామంలోని ఇతర వీధుల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. సరిగ్గా వేయని సీసీ రోడ్లు, అసంపూర్తిగా ఉన్న మురుగు కాలువల కారణంగా నీరు సాఫీగా వెళ్లడంలేదు. ఈ నిలిచిన నీరు దోమలకు నిలయంగా మారి అనారోగ్య సమస్యలకు దారితీస్తోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై పేరుకుపోయిన బురద, నిలిచిన నీటి కారణంగా ప్రయాణం చేయాలంటేనే భయంగా ఉందని వారు అంటున్నారు.

అధికారులకు విజ్ఞప్తి..

ఈ సమస్యపై అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. పక్కా ప్రణాళికతో సీసీ రోడ్లను పునర్నిర్మించి, నీరు నిలవకుండా చూడాలని అంటున్నారు. మురుగు కాలువల నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో చేపట్టి గ్రామాన్ని పరిశుభ్రమైన గ్రామంగా మార్చాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డుపై నడిచే పరిస్థితి లేదు



మా గ్రామంలో రోడ్డుపై నడవాలంటేనే భయం వేస్తోంది. మురుగుకాల్వలు లేకపోవడం, రోడ్డు ఒంపులో ఉండటం ప్రధాన సమస్యగా మారింది. కొద్దిపాటి వర్షం వచ్చినా బురద, నీళ్లు నిలిచిపోతున్నాయి. ఆ నీళ్లలో నడిచి వెళ్లడం ఇబ్బంది అవుతోంది. చాలామంది జారిపడి గాయాలపాలవుతున్నారు. బైక్‌లు కూడా జారిపడుతున్నాయి. అధికారులు స్పందించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీళ్లు నిలవకుండా చూడాలి.

– తండు మహేష్, నెమ్మికల్

సంతోషిమాత జన్మదిన వేడుకలు

సూర్యాపేట : పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీసంతోషిమాత జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివరామకృష్ణ శర్మ అమ్మవారికి తెల్లవారుజామున 108 కలశములతో అభిషేకం నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు బ్రాహ్మండ్లపల్లి మనోహర్ గుప్త దంపతులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఖీ ఉత్సవం నిర్వహించి భక్తుల సహకారంతో తయారు చేయించిన వెండి గిన్నె, ప్లేట్లు, గ్లాసులు అమ్మవారికి సమర్పించారు. భక్తులు ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకున్నారు. సంతోషిమాతకు ఉద్యాపన వ్రతం, ఒడిబియ్యం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. వెన్నెల్లో పారాయనం, నామకరణ మహోత్సవం, పవలింపు సేవ కార్యక్రమాలు నిర్వహించి మూడు రోజులుగా జరుగుతున్న జన్మదిన వేడుకలను పరిసమాప్తి చేశారు. కార్యక్రమంలో కోశాధికారి పాలవరపు రామమూర్తి, దేవాలయ కమిటీ సభ్యులు పబ్బా ప్రకాశ రావు, దేవరశెట్టి సోమయ్య, బెలిదె అశోక్, మహంకాళి ఉపేందర్, గోపారపు రాజు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, దేవి దత్తు, సంతోష్, రవిశంకర్, శివ ప్రసాద్, తోట లక్ష్మీనరసింహారావు, దేవాలయ సహాయ అర్చకులు భట్టారం వంశీకృష్ణశర్మ, అశోక్ మిశ్రా, దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన వేణారెడ్డి..

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి శ్రీ సంతోషిమాత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అంజద్ అలీ, కాంగ్రెస్ పార్టీ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీసంతోషిమాత



పూజలు నిర్వహిస్తున్న కొప్పుల వేణారెడ్డి

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ



భానుపురి : హైదరాబాద్‌లో పటేల్ రమేష్‌రెడ్డికి రాఖీ కడుతున్న మంత్రి సీతక్క



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌కు రాఖీ కడుతున్న బోయలపల్లి రేఖ



హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సామేల్‌కు రాఖీ కడుతున్న తిరుమలగిరి మార్కెట్ చైర్‌పర్సన్

భానుపురి : రాఖీ పండుగ అన్నాచెల్లెల్ల అనుబంధానికి ప్రతీక అని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం బాలభవన్‌లో చిన్నారులతో కలిసి కలెక్టర్ రాఖీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులు కలెక్టర్‌కు రాఖీలు కట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిన్నారులు బాగా చదివి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఏమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రెండు నెలల్లో నూతన చిల్డ్రన్ హోమ్ పూర్తవుతుందని తెలిపారు. అనంతరం చిన్నారులకు డ్రస్‌లు, రెయిన్ కోట్స్, పెన్నులు, లూడో, చెస్, షటిల్ ఆట వస్తువులు మిఠాయిలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాల సంరక్షణ అధికారి రవి, సూపరింటెండెంట్ మంగతాయమ్మ, అధికారులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి రాఖీ కట్టిన రేఖ

సూర్యాపేట : రాఖీ పండుగ సందర్భంగా గాంధీ భవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు బోయలపల్లి రేఖ శనివారం కలిసి రాఖీ కట్టారు.

తిరుమలగిరి : రాఖీ పౌర్ణమి సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్‌కు హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాస గృహంలో తిరుమలగిరి మార్కెట్ చైర్‌పర్సన్ చామంతి నరేష్, శాగంటి అనసూయరాములు రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు.



సూర్యాపేటలో మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డికి రాఖీ కడుతున్న ముస్లిం మహిళ



నూతనకల్ : మార్కెట్ చైర్మన్ గిరిధర్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి విజయలక్ష్మి

అధికారులు సూచనలివ్వాలి

నడిగూడెం : సాగర్ ఆయకట్టులో సాగు చేసిన వరి పంటలో కలుపు అదుపులోకి రావడం లేదని పలువురు రైతులు తెలిపారు. శనివారం నడిగూడెం మండల పరిధిలోని రామాపురం గ్రామానికి చెందిన పలువురు మాట్లాడుతూ.. కలుపు నివారణకు అనేక మందులు పిచికారీ చేసినా నివారణ కావడం లేదన్నారు. సంబంధిత వ్యవసాయ అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు గ్రామంలో పర్యటించి రైతులకు సూచనలివ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతులు బూతుకూరి వెంకటరెడ్డి, మారిశెట్టి నర్సింహారావు, ఈద శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, సింగారెడ్డి పుల్లారెడ్డి, అటూరి వెంకటరెడ్డి, మెండె రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నూలు పున్నమి ఉత్సవం



మాలిపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేడుకల్లో పాల్గొన్న పద్మశాలీలు

తిరుమలగిరి : మాలిపురంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో నూలు పున్నమి (రాఖీ పౌర్ణమి) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యావాహచనం, మార్కండేయ హోమం జరిపారు. పద్మశాలీ కుల సభ్యులుతో మూకుమ్మడి యజ్ఞోపవీతధారణ(జంధ్యాలు వేసుకొనుట) కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాలిపురం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు మద్దూరి శంకరయ్య, ప్రధాన కార్యదర్శి వంగరి సోమయ్య, ఉపాధ్యక్షుడు వంగరి సూర్యనారాయణ, కోశాధికారి అమతం రాజు, కార్యదర్శి వంగరి ఉపేందర్, కార్యవర్గ సభ్యులు వంగరి వెంకన్న, ఎనగందుల రవి, మంచే అంబాదాస్, గౌరవ సలహాదారులు వంగరి సత్తయ్య, కుల సభ్యులు వంగరి బ్రహ్మం, కిరణ్, మద్దూరి వెంకన్న, వంగరి శ్రీనివాస్, వంగరి కిషన్, అమతం శ్యాం, వంగరి కోటయ్య, కోట సిద్ధిరాములు, దుస్స వెంకట్, ఎనగందుల శ్రీకాంత్ పాల్గొన్నారు.

బోనాల పండుగకు వేళాయే..




సూర్యాపేటలో ఆదివారం జరిగే బోనాల వేడుకలకు ముస్తాబైన ఊర ముత్యాలమ్మ ఆలయం, ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం

మునగాల : బరాఖత్‌గూడెం శివారులోని స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం స్వామివారి జన్మదినాన్ని పురస్కరించుకొని స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా జరిపారు. వేకువజాము నుంచే ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పురోహితులు కందాళ శ్రీనివాసాచార్యులు, ప్రశాంత్‌చార్యులు, ఆలయ చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాస్ – రాణి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నడిగూడెం : మోతె మండలం ఉర్లుగొండ గ్రామ పరిధిలోని పాలేరు వాగు నుంచి నడిగూడేనికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ గందమల్ల అజయ్‌కుమార్ తెలిపారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి డ్రైవర్ భూక్యా మోహన్‌పై కేసునమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏబీపీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్

సూర్యాపేట : అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ (ఏబీఏపీ) సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని శనివారం సూర్యాపేట పట్టణంలోని శ్రీ ప్రసాద్ ఉడిపి హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప ధర్మ ప్రచార సభ జిల్లా అధ్యక్షుడు రంగు ముత్యంరాజు ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుంచి బతుకుదెరువు నిమిత్తం సూర్యాపేట పట్టణానికి వలస వచ్చిన వారిలో కొంతమందిని ఒక్కటిగా చేర్చి వారికి మహిళలచే రాఖీలు కట్టించారు. కార్యక్రమంలో అఖిల కమిటీ సభ్యులు రాఘవ శెట్టి, చిల్ప నాగభూషణం, రంగు స్వాతి, సుమిత్ర శెట్టి, సుకేష్, గణేష్, పట్టణా నికి చెందిన పలువురు పాల్గొన్నారు.



రాఖీ కడుతున్న మహిళలు

1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి



అర్వపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ రామకోటి, పోలీస్ సిబ్బంది

అర్వపల్లి : సైబర్ మోసాలకు గురయితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అర్వపల్లి ఏఎస్‌ఐ రామకోటి తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణపై శనివారం అర్వపల్లిలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైనా అపరిచితులు ఫోన్ ద్వారా, సోషల్ మీడియా ద్వారా, మెసేజ్‌ల ద్వారా వెబ్‌లింక్‌లు, యాప్స్ పంపితే ఏ విధంగా కూడా స్పందించకూడదని చెప్పారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి, డ్రగ్స్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సతీష్, నాగయ్య, రవి, అశోక్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



సూర్యాపేట : యూత్ కాంగ్రెస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



తిరుమలగిరిలో వేడుకల్లో పాల్గొన్న నాయకులు

సూర్యాపేట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు బైరు శైలేందర్, రాపర్తి శ్రీనివాస్, గందూరి రమేష్, అనంతుల యాదగిరి పాల్గొన్నారు.

తిరుమలగిరి : యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం తిరుమలగిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తెలంగాణ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ యాదవ్ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వై.నరేష్, అంబేద్కర్, జమ్మిలాల్, లక్ష్మయ్య, అబ్బాస్, హఫీజ్ పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలో శనివారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది దరూరి యోగానందచారి, స్థానిక దేవస్థాన చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మొరపాక సత్యం, సతీష్‌రెడ్డి, గిరిబాబు, ఖాజా, రాంబాబు పాల్గొన్నారు.

నాగారం : నాగారం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్‌కే యాకూబ్ వలీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువజన కాంగ్రెస్ నాయకులందరూ స్థానిక సంస్థల ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించి కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, కాంగ్రెస్ నాయకుడు వెంకటభిక్షం పాల్గొన్నారు.

తుంగతుర్తి : కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో యూత్ కాంగ్రెస్ కీలకపాత్ర పోషిస్తుందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సృజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా సెక్రటరీ బైరు చిరంజీవి, నియోజకవర్గ సెక్రటరీ వీర బోయిన గంగరాజు యాదవ్, మండల ఉపాధ్యక్షుడు భూసాని చిన్ని కృష్ణ యాదవ్, కాంగ్రెస్ నాయకులు కొండ రాజు, ఉప్పుల రాంబాబు పాల్గొన్నారు.



నాగారం : ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు



అర్వపల్లి : వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

సాధారణ స్థితికి కేజీబీవీ



వర్షపు నీటితో నిండాక ఇలా..

అర్వపల్లి : వర్షాలకు గత వారం రోజులుగా జలమయమవుతున్న అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ఎట్టకేలకు నీళ్లు తగ్గాయి. అయితే శుక్రవారం వరకు కేజీబీవీ పూర్తిగా జలమయం కావడంతో బాలికలను అధికారులు ఇళ్లకు పంపించారు. నీళ్లు తగ్గాక తిరిగి రావాలని వారికి సూచించారు. శనివారం పూర్తిగా నీళ్లు తగ్గాయి. మాటి మాటికి నీళ్లు నిలిచి చదువులకు ఇబ్బందులవుతున్నాయని, నీళ్లు ఆగకుండా చర్యలు తీసుకోవాలని బాలికలు, వారి తల్లిదండ్రులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



నీరు తగ్గాక..

విఖనస మహర్షి జయంతి

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం విఖనస మహర్షి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విఖనస నామార్చన, విశేష అభిషేకాలు, విశేష అర్చనలు జరిపారు. శ్రావణమాసం, రాఖీ పౌర్ణమి పూజలను నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం గావించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, రామకృష్ణచక్రవర్తి, భక్తులు పాల్గొన్నారు.



అర్వపల్లి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సంక్షిప్త సమాచారం

నులిపురుగుల నిర్మూలనతో ఆరోగ్యం

నడిగూడెం : నులిపురుగుల నిర్మూలనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి అన్నారు. ఈ నెల 11న జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రత్యే క అధికారి విజయ, ఏఎన్‌ఎం సుజాత పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ వేడుకలు

కోదాడరూరల్ : మంగళితండాలో శనివారం తీజ్ వేడుకలను గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. గిరిజనులు నృత్యాలు చేస్తూ గోధుమల మొలకలను ఊరేగింపుగా తీసుకెళ్లి నీటిలో వదిలారు.